క్లుప్తంగా

చెక్కుల పంపిణీ


కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని 52, 58వ డివిజన్లలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసుతో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం మేయర్ పునుకొల్లు నీరజ, పాలనాధికారి శ్రీనివాసరావు అందించారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ ఇన్‌చార్జ్ జిల్లా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు, డివిజన్ నాయకులు సోమిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, నల్లమల్ల వేణు, కుంచెపు ఆశయ్య, గద్దం వెంకటయ్య, బాబు, సీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలని మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు సూచించారు. మండలంలోని చెన్నారం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త ఆధార్ కార్డులు, అందులో తప్పులు, సవరణలు చేసుకునే వీలుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు సేవా పతకం


పతకం అందిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మం లీగల్: ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న అలవాల మదార్‌కు మంగళవారం సీపీ సునీల్‌దత్ సేవా పతకాన్ని అందించారు. ఈ సందర్భంగా సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ రాజు, సిబ్బంది, న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

సీసీఐ కేంద్రాలు ప్రారంభించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

కూసుమంచి: పత్తి కొనుగోళ్లకు సీసీఐ కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఐఎఫ్‌టీయూ సబ్ డివిజన్ కార్యదర్శి ఐ.వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కూసుమంచిలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అతివృష్టి, అనావృష్టితో నష్టపోయిన పత్తి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే కేంద్రాలను తెరిపించాలన్నారు. లేకపక్షంలో దళారుల చేతిలో నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు బజ్జూరి వెంకట్రామిరెడ్డి, మాతంగి రామస్వామి, చెరకుపల్లి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

ఖమ్మం మామిళ్లగూడెం: నాయీ బ్రాహ్మణుల సంక్షేమం కోసం యూత్ కమిటీ కృషి చేయాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఖమ్మం నగర అధ్యక్షుడు యలమందల జగదీష్, కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాసరావు కోరారు. ఖమ్మం నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో మంగళవారం నూతన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఖమ్మం టౌన్ యూత్ కమిటీని ఎన్నుకున్నారు. ఖమ్మం టౌన్ యూత్ ప్రెసిడెంట్‌గా అద్దంకి రవి, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా గుండ్లపల్లి నరేష్, సురభి కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా జూలూరు మహేష్, జనరల్ సెక్రటరీగా దోమకొండ మధు, సెక్రటరీగా ఆలేటి రవితేజ, కోశాధికారిగా జూలూరి నాగరాజు, యూత్ ప్రచార కార్యదర్శిగా యలమందల నవీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, నగర కమిటీ సభ్యులు, యూత్ కమిటీ సభ్యులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఓజీ
వినోద	శశివదనే, కాంతార, కిష్కింధపురి
సాయిరాం	అరి , కానిస్టేబుల్
ఆదిత్య	కాంతార, మిరాయ్
శ్రీనివాస	ట్రోన్, మిరాయ్

\- ఖమ్మంగాంధీచౌక్


ఓ దుకాణంలో విక్రయానికి ఉంచిన ప్లాస్టిక్ కవర్లు


ప్లాస్టిక్ కవర్‌లో కూరగాయల విక్రయాలు..

ప్లాస్టిక్‌పై సమరం..

- నగరంలో కోరలు చాస్తున్న ప్లాస్టిక్
- ఉదాసీనతగా వ్యవహరిస్తున్న అధికారులు
- పర్యావరణ పరిరక్షణకు చర్యలు శూన్యం
- కమిషనర్ ఆదేశాలతో కదిలిన కేఎంసీ యంత్రాంగం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరంలో పర్యావరణహితాన్ని కాంక్షిస్తూ ప్రభుత్వ ఆదేశాలతో మూడేళ్ల క్రితమే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని ఖమ్మంలో నిషేధించారు. అయినా అధికారుల ఉదాసీనతతో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోయిందనే విమర్శలు ఉన్నాయి. కేఎంసీ కమిషనర్ ఆదేశించినప్పుడు, ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే శానిటేషన్ అధికారులు అడపాదడపా తనిఖీలు చేసి రూ.1,000 నుంచి రూ.2 వేల జరిమానా విధించి చేతులు దులుపుకున్నారు. తాజాగా కేఎంసీ కమిషనర్ ప్లాస్టిక్ నిషేధం విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించడంతో కేఎంసీ పరిధిలో శానిటేషన్ అధికారులు తనిఖీలు ప్రారంభించారు.

ఆకస్మికంగా రంగంలోకి..

ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యాన అధికారులు ఆకస్మికంగా రంగంలోకి దిగారు. ప్రధానంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగులు, వస్తువులు విక్రయిస్తున్న దుకాణాలపై దృష్టి సారించారు. ప్రత్యేక బృందాలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేసి భారీగా జరిమానాలు విధిస్తున్నారు. గత నాలుగు రోజుల్లో సుమారు రూ.2 లక్షలకు పైగా జరిమానాలను విధిస్తుండడంతో వ్యాపారులు కొంతవరకు ఆత్మరక్షణలో పడ్డారు. పట్టుబడిన ప్లాస్టిక్ వస్తువులను వెంటనే స్వాధీనం చేసుకుంటున్నారు. ఈనేపథ్యాన ఫిర్యాదులు అందితేనో.. అధికారులు ఆదేశిస్తేనో కాకుండా తనిఖీలను నిరంతరం, పారదర్శకంగా కొనసాగిస్తే ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా అరికట్టవచ్చని ప్రజలు, పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

అంతా బహిరంగంగానే..

కేఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో నగరంలో ప్లాస్టిక్ కోరలు చాస్తోంది. వ్యాపారులు వీటిని బహిరంగంగా వినియోగిస్తున్నా.. క్షేత్రస్థాయిలో కేఎంసీ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అంతేకాక ప్లాస్టిక్‌ను పట్టుకోకుండా ఒకరిద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు వ్యాపారుల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక ప్లాస్టిక్ కవర్లను వినియోగదారులు ఇష్టానుసారంగా బయటపడవేస్తుండడంతో డ్రెయినేజీల్లోకి చేరి మురుగు నీరు బయటకు పోలేని పరిస్థితి నెలకొంది. ఒక పక్క పర్యావరణం దెబ్బతింటుండగా.. మరో పక్క నగరంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవుతోంది.

పేరుకే ప్రత్యేకాధికారి..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌ను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడంతో పాటు పర్యావరణానికి హాని కల్గించే చర్యలను కట్టడి చేసేందుకు భారీ వేతనంతో ఓ ప్రత్యేక అధికారిని నియమించారు. అయినా సరైన ఫలితం లేదని కేఎంసీలోనే చర్చ జరుగుతోంది. అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో స్వచ్ఛ నగరాల ర్యాంకింగ్‌లో కేఎంసీ ర్యాంక్ పడిపోవడంపై కూడా సదరు అధికారిపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఈ అధికారితో ప్లాస్టిక్ నిషేధం, నగర శుభ్రతపై పని చేయిస్తేనే ఫలితం వస్తుందని ప్రజాప్రతినిధులు చెబుతుండడం గమనార్హం.



ఇటీవల తనిఖీల వివరాలు..

- ఈ నెల 9న 7 దుకాణాల్లో తనిఖీలు చేసి 70 కిలోల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని రూ.81,500 జరిమానా విధించారు.
- ఈ నెల 11న నాలుగు దుకాణాల్లో తనిఖీ చేసి 5 కిలోల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని రూ.20 వేల జరిమానా విధించారు.
- మంగళవారం ఒక దుకాణంలో 5 కిలోల సింగిల్ యూజ్ సంచులను పట్టుకుని రూ.5 వేల జరిమానా విధించారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఖమ్మంలీగల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్గి ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు అన్నారు. మంగళవారం త్రివేణి టాలెంట్ స్కూల్‌లో న్యాయ అవగాహన సదస్సు, అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించగా.. ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఫోన్‌లకు ఆకర్షితులు కావొద్దని, ర్యాగింగ్‌లకు పాల్పడొద్దని పేర్కొంటూ నిర్భయచట్టం 2012పై వివరించారు. ఏదైనా న్యాయ సలహా కోసం నాల్సా టోల్‌ఫ్రీ నంబర్ 15100కి ఫోన్ చేయాలని, ఆర్థిక స్తోమత లేకపోతే ఉచితంగా న్యాయవాదిని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి.రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ఎండీ.ముస్తఫా, క్యాంపస్ ఇన్‌చార్జ్ జీ.వీ.చార్లెస్, న్యాయవాది హరి, అధ్యాపకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రావు

దళిత ఐపీఎస్ అధికారి ఆత్మహత్య బాధాకరం

ఖమ్మం మామిళ్లగూడెం: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి పోరన్ కుమార్ కుల వివక్ష కారణంగా అవమానం తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని, ఇది ముమ్మాటికి అగ్రకుల ఆధిపత్య హత్య అని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మనువాద సిద్ధాంతం పేరుతో సమాజాన్ని విషతుల్యం చేస్తున్నాయన్నారు. సిట్టింగ్ జడ్జితో తక్షణమే విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించి,దళిత ఐపీఎస్ అధికారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లిగుండ్ల ముత్తయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడిశాల వెంకన్న, జిల్లా అధ్యక్షుడు దొబ్బిలి శీను, ఆదూరి బాలకృష్ణ, బొడ్డు వెంకయ్య బాబు, వీరస్వామి దుంపటి బాబూరావు, జంగం నగేష్, పిల్లిగుండ్ల శేఖర్, కిన్నెర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రాపర్తినగర్‌లోని ఐదు ఇళ్లలో చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం రాపర్తినగర్‌లోని పలువురి ఇళ్లలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. తాళం వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. రెండు ఇళ్లలో కొంత మేరకు సొత్తును అపహరించగా, మిగతా ఇళ్లలో ఏమేం చోరీ జరిగాయో యాజమానులు వచ్చాక తెలియనుంది. ఈమేరకు ఆయా గృహాలను సీసీఎస్ సిబ్బంది, ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ పరిశీలించారు. అయితే, రాపర్తినగర్ బీసీ కాలనీ, టీఎన్జీవోస్ కాలనీల్లో రెండు రోజులుగా అపరిచిత వ్యక్తులు తిరుగుతున్నారని, స్థానికులు ఆరా తీస్తే వచ్చిరాని తెలుగులో మాట్లాడినట్లు తెలిసింది. ఈ ప్రాంతంలో పోలీస్ పెట్రోలింగ్ లేకపోవడంతో చోరీలు జరిగాయని స్థానికులు ఆరోపించారు.

ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపునకు కృషి చేద్దాం

ఖమ్మం మామిళ్లగూడెం: హైదరాబాద్ జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న నవీన్ యాదవ్ గెలుపునకు కృషి చేయాలని ఖమ్మం నియోజకవర్గ యాదవులు పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం త్రీటౌన్ వర్తక సంఘం భవనంలో ఆత్మీయ సభ నిర్వహించగా.. 27వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డ నగేష్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు జల్లెల శ్రీనివాస్, చెవుల శ్రీనివాస్‌లు మాట్లాడారు. యాదవులంతా ఐక్యంగా ఉండి ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కోడి లింగయ్య, వైరా మాజీ మార్కెట్ చైర్మన్ గుమ్మ రోశయ్య, వల్లూరి తిరుపతిరావు పాల్గొన్నారు.

టీటీడీ ఆలయ నిర్మాణానికి సహకరిద్దాం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 15వ డివిజన్ పరిధి అల్లీపురం – కొత్తగూడెం మధ్య టీటీడీ ఆధ్వర్యాన వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఇరు గ్రామాల ప్రజలు నిర్ణయించినట్లు తెలిసింది. అల్లీపురం రైతు వేదికలో రెండు గ్రామాల నాయకులు, పొలాలు, ఇళ్ల స్థలాలు కోల్పోనున్న రైతులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసైన్డ్ పట్టాలు ఉన్న రైతులు, పేదలకు తగిన న్యాయం చేసేలా నిర్ణయించగా, ఆలయం నిర్మిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే, నిర్వాసితులకు న్యాయం చేసేలా అధికారులు హామీ ఇచ్చాకే నిర్ణయం ఖరారు చేయాలని నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు. ఈసమావేశంలో కార్పొరేటర్ రావూరి కరుణ, పీఏసీఎస్ చైర్మన్ రావూరి సైదబాబు, వివిధ పార్టీల నాయకులు సంక్రాంతి నాగేశ్వరరావు, యర్రబోయిన గోవిందరావు, చేతుల నాగేశ్వరరావు, వెనిగళ్ల సత్యనారాయణ, సత్తి గోపాల్, చేతుల తిరుపతిరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాచారం

మండల స్థాయి క్రీడాపోటీలు..

ఖమ్మం అర్బన్: ఖమ్మం అర్బన్(నార్త్) మండల స్థాయి క్రీడాపోటీలను ఈనెల 15, 16వ తేదీల్లో బల్లేపల్లిలోని బ్లూమింగ్ మైండ్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి బియ్యని కృష్ణయ్య తెలిపారు. పాఠశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ 15వ తేదీన అండర్-14, 17 బాలికల విభాగంలో, 16న అండర్-14, 17 బాలుర విభాగంలో పోటీలు జరుగుతాయని చెప్పారు. మండల పరిధిలోని అన్ని పాఠశాలల నుంచి ఎంట్రీలు వచ్చేలా యాజమాన్యాలు, పీఈటీలు సహకరించాలని ఎంఈఓ, మండల క్రీడా కమిటీ చైర్మన్ శైలజాలక్ష్మి సూచించారు. ఈసమావేశంలో అశోక్‌రెడ్డి, నాగప్రసాద్, రోజా, నాగుల్ మీరా, రాము తదితరులు పాల్గొన్నారు.


గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు..

కూసుమంచి: మండలంలో బుధవారం నుంచి వచ్చే నెల 14 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి నీలకాంత్ తెలిపారు. తమ సిబ్బంది రెండు టీమ్‌లుగా గ్రామాల వారీగా టీకాలు వేయనుండగా.. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం..

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని బుర్హాన్‌పురం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ బస్టాండ్ ఫీడర్ మరమ్మతులు కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, 11 కేవీ ఎన్‌ఎస్‌టీ ఫీడర్ పరిధిలో ఉదయం 12 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-1 ఏడీఈ నాగార్జున మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మామిళ్లగూడెం, బస్ డిపో రోడ్, మయూరిసెంటర్, భక్తరామదాసు కళాక్షేత్రం ప్రాంతం, ఆర్టీఓ ఆఫీస్ ఏరియా, సరిత క్లినిక్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

విద్యార్థులపై ఫీజుల భారం సరికాదు


వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

ఖమ్మం మామిళ్లగూడెం: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ కోర్సుల మొదటి సంవత్సరం విద్యార్థులకు పెంచిన ఫీజులు ఉపసంహరించుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఇటికల రామకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మంద సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేయూ వైస్ చాన్స్‌లర్ ఖమ్మం పర్యటన సందర్భంగా.. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన వీసీ ప్రతాప్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఫీజుల భారాన్ని విద్యార్థులపై మోపడం సరికాదని, తక్షణమే ప్రభుత్వం పునరాలోచన చేసి తగ్గించాలని, లేకపోతే ప్రభుత్వంపై ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వినతి అందించిన వారిలో శ్యామల, రాము, శివ, గోపి, మనోజు, శ్రీనాథ్, లోకేష్, సాత్విక తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేశారు. ఈ సందర్భంగా తల్లులు, పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. – సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంమయూరి సెంటర్: రామన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఫుడ్‌స్టాల్ ఏర్పాటులో మాట్లాడుతున్న ఖమ్మం అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ వీరభద్రమ్మ

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మరు..

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంవైరారోడ్: తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఇక నమ్మరని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు సందర్భంగా మంగళవారం ఖమ్మం నియోజకవర్గ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 11న జరిగే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార కార్యక్రమంలో ఖమ్మం నియోజకవర్గ నాయకులు పాల్గొని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దివంగత నేత మాగంటి గోపినాథ్ సతీమణి సునీతను గెలిపించి ఆయన రుణం తీర్చుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు విసుగుచెంది మరలా కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాల కృష్ణ, టేకులపల్లి సొసైటీ చైర్మన్ బీరెడ్డి నాగచంద్రరెడ్డిలతో పాటు ఖమర్, బచ్చు విజయ్‌కుమార్, కర్నాటి కృష్ణ, మక్బూల్, తాజుద్దీన్, వీరు నాయక్, బత్తుల మురళి, కార్పొరేటర్లు చిరుమామిళ్ల లక్ష్మి నాగేశ్వరరావు, కూరాకుల వలరాజు, బుడిగం శ్రీను, పసుమర్తి రామ్మోహన్, జ్యోతి రెడ్డి, రుద్రగాని శ్రీదేవి ఉపేందర్, ముక్కాల రాజేష్, దనాల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి అజయ్‌కుమార్

సన్మానం..

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల పదవీ విరమణ చేసిన తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ డ్రైవర్ మొహమ్మద్ అబ్దుల్ హకీమ్‌ను మంగళవారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తన క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ.. పదవీ విరమణ సమయాన తాను అందుబాటులో లేకపోవడంతో సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మగ్బుల్, సిటీ లైట్ హౌస్ నజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమించడం నేరం


ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

ఖమ్మంరూరల్: ప్రభుత్వ భూమి ఎవరైనా ఆక్రమిస్తే అది చట్టరీత్యా నేరమని తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఆర్ఐ ప్రసాద్‌లు తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని బారుగూడెంలో సర్వే నంబర్ 26లో గల ప్రభుత్వ భూమిలో మంగళవారం కొందరు ఫెన్సింగ్ వేసి ఆక్రమించేందుకు ప్రయత్నించగా వారిని అడ్డుకున్నారు. సర్వే చేసి అది ప్రభుత్వ భూమి అని తేల్చి స్వాధీనపర్చుకున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించినా, ఆక్రమించాలని చూస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, ఆక్రమణలు తొలగించడమే కాకుండా వారిపై క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందని హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న భూమికి సంబంధించి అక్కడ వ్యవసాయం చేయనందున గతంలోనే అసైన్‌మెంట్‌దారుల నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు.

కేఎంసీ సమాచారం..

పారిశుద్ధ్య పనులు పరిశీలించిన కమిషనర్


అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో పారిశుద్ధ్య పనులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య తనిఖీ చేశారు. మంగళవారం నగరంలోని మమతా రోడ్డు, చెరువు బజార్, బోనకల్ రోడ్డు, ముస్తఫానగర్, ధంసలాపురం, శ్రీనివాసనగర్, ప్రకాశ్‌నగర్ ప్రాంతాల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పబ్లిక్ టాయిలెట్లను శుభ్రంగా ఉంచాలని, రోడ్ల వెంట పిచ్చి మొక్కలు, మట్టి తొలగించాలని ఆదేశించారు. ఈ పది రోజుల ప్రత్యేక డ్రైవ్ పక్కాగా జరగాలని సూచించారు. 18వ డివిజన్‌లో జవాన్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసి పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు.

రూ.10 వేల జరిమానా..

18వ డివిజన్‌లో రోడ్డుపై భవన నిర్మాణ వ్యర్థాలు పోసిన యజమానికి కేఎంసీ కమిషనర్ ఆదేశాలతో అధికారులు రూ.10 వేల జరిమానా విధించారు. ప్రజలకు అసౌకర్యం కలిగించేలా రోడ్లపై వ్యర్థాలు పోస్తే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు ఉంటామని కమిషనర్ హెచ్చరించారు.

ఖాళీ స్థలాలు శుభ్రంగా ఉండాలి..

నగరంలో ఖాళీ స్థలాలను మూడు రోజుల్లో సంబంధిత యజమానులు శుభ్రం చేసుకోకుంటే యజమానులకు రూ.10 వేల జరిమానా విధిస్తామని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి, నీళ్లు నిలిచి అధ్వానంగా ఉండి నగరం అపరిశుభ్రంగా కనిపిస్తుందన్నారు.

24న కేఎంసీ ఎదుట ధర్నా

ఖమ్మంమయూరిసెంటర్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.రామయ్య అన్నారు. మంగళవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నగర అధ్యక్షుడు దున్న గురువయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 65 వేల మంది మున్సిపల్ కార్మికులకు మూడు కేటగిరిల వారీగా వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. కార్మికులకు ఈఎస్ఐ కార్డులు లేక వైద్యం చేయించుకునే పరిస్థితిలో లేరన్నారు. వేతనాల పెంపునకు ఈ నెల 24న మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ నగర కార్యదర్శి కొయ్యల శ్రీనివాస్, తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిన్నెర నారాయణ, పార్థు, యాదమ్మ, శ్రీనివాస్, వీరబాబు, నాగరాజు, యుగంధర్, రాము మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

కామేపల్లి: మధ్యాహ్న భోజన వర్కర్ల పెండింగ్ వేతనాల బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నరేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తలింగాలలో మధ్యాహ్న భోజన వర్కర్ల మండల మహాసభ నిర్వహించగా.. ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇస్తామని చెప్పి నేటికి అమలు చేయడం లేదన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా జయమ్మ, సుగుణమ్మతో పాటు మరో 13 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అరుణ, నాగలక్ష్మి, మంగమ్మ, కోటమ్మ, లక్ష్మి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై వినతి


వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రోగ్రెసివ్ భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మం అసిస్టెంట్ లేబర్ అధికారి వెంగమాంబకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఐ.వెంకన్న, గుగులోత్ పటేల్, బోడ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, సీఎస్‌సీ కేంద్రాల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి నేడు(బుధవారం) హైదరాబాద్‌లోని భవన నిర్మాణ సంక్షేమ బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కోటపర్తి మాధవరావు, చింతావత్ దేవదాస్, బోడ రాములు నాయక్, బానోత్ కిషన్, శ్రీను, సైదులు తదితరులు పాల్గొన్నారు.

అలుగు అందాల ఆరబోత..



మండలంలోని చెరువు మాధారం చెరువు అలుగు అందాలు ఆరబోస్తూ కనువిందు చేస్తోంది. ఇటీవల ఎండ తీవ్రతతో చెరువు నీటి మట్టం చాలా వరకు తగ్గింది. గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పాటు పైనుంచి వస్తున్న వరదతో చెరువు నిండి అలుగుపోస్తుంది. దీంతో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు సందర్శించి ఫొటోలు దిగుతూ సందడి చేస్తున్నారు. – నేలకొండపల్లి